వేతన జీవుల ఇక్కట్లు

ఉద్యోగులకు చుక్కలు చూపిస్తున్న వైసీపీ ప్రభుత్వం

- ఏళ్ల తరబడి చెల్లింపులకు నోచుకోని బిల్లులు
- పెండింగ్‌లో సుమారు రూ.60 కోట్ల బకాయిలు
- అస్తవ్యస్తంగా నెల వారీ జీతాల బట్వాడా
- ఉద్యమబాట పట్టిన ఉద్యోగులపై పోలీసులతో ఉక్కుపాదం
- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎన్నెన్నో హామీలు
- అధికారంలోకి వచ్చి నాలున్నరేళ్లయినా అమలు చేయని వైసీపీ పాలకులు
- విసిగిపోయి సమ్మె బాటపట్టిన పలు శాఖల ఉద్యోగులు
- ఎస్మా, షోకాజ్ నోటీసులతో ప్రభుత్వం బెదిరింపులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఉద్యోగుల ఆర్థికపరమైన సమస్యలపై ప్రభుత్వం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంతో వేలాది మంది వేతన జీవులు ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్మును, కుటుంబ అవసరాల కోసం తీసుకొనే అవకాశం లేకపోగా.. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తే చాలు అన్న దుస్థితికి ప్రభుత్వం తీసుకువచ్చింది. పీఆర్‌సీ, డీఏలు, సరెండర్ లీవ్‌లకు సంబంధించి బకాయిలు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ఆందోళనబాట పడుతున్నారు. న్యాయబద్ధమైన ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులపై ప్రభుత్వం పోలీసుల ద్వారా ఉక్కుపాదం మోపుతున్నది. ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నదంటూ ఉద్యోగులు మరింత మండిపడుతున్నారు.

కొండలా పేరుకుపోతున్న బిల్లుల బకాయిలు

జిల్లాలో అన్ని శాఖల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు సుమారు 18 వేల మందికి ఉన్నారు. వీరిలో దాదాపు ఏడు వేల మంది ఒక్క విద్యా శాఖలోనే పనిచేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తమకు ఇక్కట్లు మొదలయ్యాయని ప్రభుత్వ ఉద్యోగులు వాపోతున్నారు. పీఆర్‌సీ అమలు, డీఏలు, సరెండ్ లీవ్‌లకు సంబంధించి బకాయిలు చెల్లింపులు 90 శాతానికి పైగా నిలిచిపోయాయి. ఖజానా కార్యాలయాల్లో సమర్పించిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. ఖజానా కార్యాలయం నుంచి బిల్లులు పాస్ చేసి, టోకెన్ నంబరు వచ్చినప్పటికీ.. ఆర్థిక శాఖ నుంచి ఆమోదం లేకపోవడంతో బిల్లుల చెల్లింపులకు మోక్షం కలగడంలేదు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగలకు దాదాపు రూ.60 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో వున్నట్టు ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. పనిచేస్తున్న ఉద్యోగులు, చనిపోయిన వారికి సంబంధించి ఏపీజీఎల్ఐ(జీవిత బీమా కార్యాలయం)లో 38 మందికి సుమారు రూ.5 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. అత్యవసర సమయాల్లో వాడుకోవడానికి దాచుకున్న డబ్బులను ఇప్పుడు అవసరాల కోసం తీసుకోవడానికి బిల్లులు పెడితే చెల్లింపులకు మోక్షం లభించడం లేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చులు, పిల్లల ఉన్నత చదువులు, వివాహాలు, ఇతరత్రా అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తున్నదని వాపోతున్నారు.



కశింకోటలో అంగన్‌వాడీ కార్యకర్త ఇంటి ప్రహరీ గోడకు అతికించిన నోటీసు

ఒకటిన జీతాలు పడి ఎన్నాళ్లయిందో..!

నాలుగున్నరేళ్ల క్రితం వరకు ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటి, రెండు తేదీల్లోనే జీతాలు అందేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఏ ఒక్క నెలలో కూడా ఒకటో తేదీన జీతాలు పడలేదని ఉద్యోగులు చెబుతున్నారు. ఒకటో తేదీన జీతాలు వస్తాయనే విషయాన్ని ఎప్పుడో మరిచిపో యామని అంటున్నారు. కొవిడ్-19 ప్రబలిన తరువాత పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు డబ్బులు పంపిణీ చేయడానికి వేల కోట్ల రూపాయలు అప్పులు చేస్తున్న ప్రభుత్వం.. తమకు ఒకటో తేదీన జీతాల చెల్లింపు విషయంలో శ్రద్ధ చూపడం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సంక్షేమ పథకాలకు తాము వ్యతిరేకం కాదని, కానీ తమకు సకాలంలో జీతాలు చెల్లించకుండా ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా విద్యా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. గత ఏడాది దాదాపు సగం నెలలు 20వ తేదీ దాటిన తరువాతే జీతాలు ... మిగతా 6వ పేజీలో



బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు (ఫైల్ ఫొటో)

షోకాజ్ నోటీసులకు బెదిరేది లేదు

న్యాయమైన డిమాండ్లను అమలు చేసే వరకు అంగన్‌వాడీల ఉద్యమం ఆగదు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద, వర్కర్ల ఇళ్ల వద్ద షోకాజ్ నోటీసులు అతికిస్తున్నారు. ఎస్మాకు, షోకాజ్ నోటీసులకు బెదిరేది లేదు. సంక్రాంతి పండుగ సమయంలో కూడా నిరసనలను కొనసాగిస్తాం. దీక్షా శిబిరాల వద్దనే వంటా-వార్పు చేసుకుంటాం.

- నాగశేషు, ప్రధాన కార్యదర్శి, జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

ఉద్యోగుల బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఉద్యోగులకు చెల్లించాల్సిన డబ్బును ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడం అన్యాయం. ఎన్నికల ముందు అప్పుడు ప్రతిపక్షంలో వున్న వైసీపీ పెద్దలు.. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామని, గతం కంటే మెరుగైన పీఆర్‌సీ ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లయినా అమలు చేయలేదు. ఉద్యోగుల ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి.

- గొంది చినబ్బాయ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మూడో జాబితాపై వైసీపీలో టెన్షన్

ఎవరి సీటుకు టెండర్ పెట్టారోనని గుబులు

- అనకాపల్లి ఎంపీ స్థానానికి పిల్లా రమాకుమారి పేరు పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం
- సీఎంను కలవడానికి తాడేపల్లి వెళ్లిన సిట్టింగ్ ఎంపీ సత్యవతి
- మరోమారు తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి
- పార్లమెంటుకు కాకపోతే అసెంబ్లీకి అయినా సరే...
- తెరపైకి విశాఖకు చెందిన కిలారి పద్మ పేరు



డాక్టర్ సత్యవతి



పిల్లా రమాకుమారి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాలకు వైసీపీ అధిష్ఠానం చేపట్టిన సమన్వయకర్తల నియామకం ఆ పార్టీ నేతల్లో అలజడి రేపుతోంది. ఇప్పటికే ప్రకటించిన రెండు జాబితాల్లో జిల్లాకు సంబంధించి అనకాపల్లి, పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తల పేర్లను ప్రకటించించిన విషయం తెలిసిందే. మూడో జాబితా విడుదలపై రెండు, మూడు రోజుల నుంచి పార్టీ పెద్దలు లీకులు ఇస్తున్నారే తప్ప జాబితాను బహిర్గతం చేయడం లేదు. అయితే అనకాపల్లి లోకసభ స్థానంతోపాటు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి కొత్తగా సమన్వయకర్తలను నియమించనున్నట్టు బుధవారం ఊహాగానాలు వినిపించాయి.

వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం వైసీపీ అధిష్ఠానం ఇప్పటికే రెండు జాబితాలను ప్రకటించింది. మూడో జాబితా రేపో మాపో విడుదల చేయనున్నట్టు తెలిసింది. అయితే జిల్లాలో ఈసారి ఎవరికి షాక్ ఇవ్వనున్నదనే దానిపై పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. మొదటి జాబితాలో అనకాపల్లి జిల్లాకు సంబంధించి ఏ నియోజకవర్గం లేకపోయినప్పటికీ రెండో జాబితాలో అనకాపల్లి, పాయకరావుపేటకు కొత్త సమన్వయకర్తలు నియమితులయ్యారు. ఎవరూ ఊహించని విధంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లికి సమన్వయకర్తగా కశింకోట మండలానికి చెందిన మలసాల భరత్‌కుమార్, గొల్ల బాబూరావు ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేటకు సమన్వయకర్తగా విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును అధిష్ఠానం నియమించిన విషయం తెలిసిందే. మూడో జాబితాలో జిల్లాలో ఏ నియోజకవర్గాల పేర్లు ఉంటాయోనని రెండు, మూడు రోజుల నుంచి అంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్తగా విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు కుమార్తె, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారిని నియమించబోతున్నట్టు ... మిగతా 6వ పేజీలో

అంగన్‌వాడీలకు నోటీసులు

ఇళ్ల వద్ద లేకుంటే కుటుంబ సభ్యులకు అందజేత

- ...వారు తీసుకోవడానికి నిరాకరిస్తే గోడలకు అంటిస్తున్న సచివాలయ సిబ్బంది/వీఆర్‌ఓలు
- బాధ్యతలను విస్మరించినందుకు విధుల నుంచి ఎందుకు తొలగించకూడదో పది రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్న అధికారులు

సబ్బవరం/ బుచ్చెయ్యపేట, జనవరి 10: డిమాండ్ల సాధన కోసం నెల రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. ఉద్యోగులు ఇంటి వద్ద లేకుంటే వారి కుటుంబ సభ్యులకు అందజేస్తున్నారు. ఒకవేళ ఇంట్లో ఎవరూ లేకపోయినా, కుటుంబ సభ్యులు తీసుకునేందుకు నిరాకరించినా గోడకు అంటిస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్టు చెబుతున్నారు. గురువారం కూడా ఈ కార్యక్రమం కొనసాగించనున్నారు. ఈ షోకాజ్ నోటీసులు పీడీ పేరుతో జారీఅయ్యాయి. మూడు పేజీల నోటీసులో ప్రాజెక్టు, సిబ్బంది పేరుతోపాటు ప్రాంతం, కోడ్ వంటి వివరాలు ఉన్నాయి. ఉద్యోగ నిబంధన ఉల్లంఘన, తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు సంజాయిషీ కోరడం...అంటూ షోకాజ్‌లో పేర్కొన్నారు. సిబ్బంది సమ్మెకు వెళ్లినప్పటి నుంచి ఇప్పటివరకూ జరిగిన పరిణామాలు, సమ్మె వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కలుగుతున్న ఇబ్బందులతోపాటు అనేక అంశాలను ఇందులో పేర్కొన్నారు. మొత్తం 12 పాయింట్లతో ఈ నోటీసులను జారీచేశారు. గత నెల 12 నుంచి విధులకు దూరంగా ఉన్నారని, షోకాజ్‌లో పైన పేర్కొన్న పరిస్థితుల్లో సూచిక (2), (3), (4) ప్రకారం ప్రభుత్వం పొందుపరిచిన విధులను, బాధ్యతలను విస్మరించి నందుకు విధుల నుంచి ఎందుకు తొలగించకూడదో నోటీస్ అందిన పది రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ పేర్కొన్నారు. తగిన సమయంలో వివరణ ఇవ్వకపోయినట్టయితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామంటూ పేర్కొన్నారు. ఉద్యోగుల ఎంపిక కమిటీ ఆదేశాలు మేరకు షోకాజ్ జారీ చేసినట్టు పీడీ ఆ షోకాజ్‌లో వెల్లడించారు. వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది ద్వారా ఈ నోటీసులు ఇస్తున్నారు.



బుచ్చెయ్యపేట మండలం వడ్దాదిలో అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ గోడకు నోటీసు అంటిస్తున్న సచివాలయ ఉద్యోగి

సబ్బవరంలో 60 మందికి నోటీసులు

సబ్బవరం మండలంలోని పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు బుధవారం సీడీపీవో లలితకుమారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సచివాలయ సిబ్బంది అయిన మహిళా పోలీసులు, వీఆర్వోలు... ఆయా అంగన్‌వాడీల వర్కర్లు, హెల్పర్ల ఇళ్లకు వెళ్లి గోడలకు షోకాజ్ నోటీసులు అంటించారు. మండలంలో మొత్తం 84 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 130 మంది పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 60 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సబ్బవరం ప్రాజెక్టు అధ్యక్షురాలు వీవీ రమణమ్మ తెలిపారు. షోకాజ్ నోటీసులను అంగన్‌వాడీ కేంద్రాల్లో అంటించాలే తప్ప సిబ్బంది ఇళ్లకు వెళ్లి గోడలకు అంటించే హక్కు ప్రభుత్వానికి లేదని ఆమె స్పష్టం చేశారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట మండలంలో మొత్తం 62 అంగన్‌వాడీ కేంద్రాలు వున్నాయి. వీటిల్లో ... మిగతా 6వ పేజీలో



రన్‌వేపై చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే గణబాబు

చంద్రబాబుకు స్వాగతం

గోపాలపట్నం, జనవరి 10: 'రా...కదలిరా...' పేరుతో విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఏర్పాటుచేసిన సభలో పాల్గొనడానికి విచ్చేసిన తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడుకు బుధవారం విశాఖ పట్నం విమానాశ్రయంలో పార్టీ నాయకులు స్వాగతం పలికారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లకు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు విమానాశ్రయంలోని రన్‌వేపై స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు, లోకేశ్‌లు హెలీకాప్టర్‌లో బొబ్బిలి బయలుదేరి వెళ్లారు.

విహారంలో విషాదం

రోడ్డు రోలర్‌ను ఢీకొన్న బైక్

ఇద్దరు డిగ్రీ విద్యార్థులు మృతి

- అరకులోయ నుంచి పాడేరు వెళుతుండగా ప్రమాదం
- మృతులిద్దరూ సాలూరు మండలం నడిమివలస వాసులు

- 6లో

దేవరాపల్లిలో ఉద్రిక్తత

తీవ్రరూపం దాల్చిన పెదగంగవరం రైతుల ఆందోళన

- వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిక
- పెట్రోల్ క్యాన్‌తో రామాలయంలో స్వీయనిర్బంధం
- గిరిజన సంక్షేమ శాఖ అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్
- ఆందోళనకారులతో చర్చలు జరిపిన మండల అధికారులు
- పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ



వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలుపుతున్న పెదగంగవరం రైతులు



రామాలయంలో పెట్రోల్ క్యాన్‌తో స్వీయనిర్బంధంలో పెదగంగవరం రైతులు

దేవరాపల్లి, జనవరి 10: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తమను వేధిస్తున్నారంటూ అనంతగిరి మండలం పెదగంగవరం రైతులు ఇక్కడ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు బుధవారం తీవ్రరూపం దాల్చాయి. కొంతమంది రైతులు వాటర్ ట్యాంకు ఎక్కగా, మరికొందరు రామాలయంలోకి వెళ్లి, తలుపులు బిగించి నిర్బంధించుకున్నారు. అధికారులు వేధింపులు ఆపకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ హెచ్చరించారు. దీంతో దేవరాపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ పెదగవగవరం గ్రామానికి చెందిన సుమారు 300 కుటుంబాల వారు దాదాపు వందేళ్ల నుంచి తరతరాలుగా భూములను సాగుచేకుంటూ జీవనోపాధి పొందుతున్నామని చెప్పారు. కానీ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు 1/70 చట్టం పేరుతో తమ సాగులో వున్న భూములను ఆన్‌లైన్ చేయకుండా వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో దేవరాపల్లి వచ్చి మూడు రోజుల నుంచి ఆందోళన చేస్తున్నట్టు చెప్పారు. కాగా భూములను ఆన్‌లైన్ చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ పెట్రోల్ క్యాన్‌తో రామాలయంలోకి వెళ్లి, తలుపులు వేసుకొని నిర్బంధించుకున్నారు. మరికొంతమంది సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి నిరసనకు ... మిగతా 6వ పేజీలో



రైతులతో చర్చలు జరుపుతున్న పోలీసులు

పారిశుధ్య కార్మికుల సమ్మె తాత్కాలికంగా విరమణ

- కొన్ని డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించినట్టు నేతలు వెల్లడి
- నేటి నుంచి విధుల్లోకి కార్మికులు
- జీవో విడుదలలో జాప్యం జరిగితే మళ్లీ సమ్మె చేస్తామని విస్పష్టం

అనకాపల్లి టౌన్/ నర్సీపట్నం/ ఎలమంచిలి, జనవరి 10: మునిసిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించారు. గురువారం ఉదయం నుంచి యథావిధిగా విధులకు హాజరుకానున్నట్టు సంఘం నాయకులు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, డ్రైవర్లు/ మలేరియా/ వెటర్నరీ/యూజీడీ కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 చెల్లించాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలిలో మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు గత నెల 26వ తేదీ నుంచి సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో పట్టణాల్లో చెత్తచెదారం కుప్పలుగా పేరుకుపోయి పారిశుధ్యం క్షీణించింది. చెత్త కుళ్లిపోయి దుర్వాసనతోపాటు దోమలు, ఈగల బెడదతో జనం తీవ్రఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ కార్మికుల సమస్యలు నెరవేర్చి సమ్మె విరమింపజేసే విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ వచ్చింది. కార్మికులు సైతం వెనక్కు తగ్గకుండా తాడోపేడో తేల్చుకుంటామంటూ సమ్మెను కొనసాగించారు. ఫలితంగా వీధుల్లో చెత్త పేరుకుపోయి అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఏర్పడడం, ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవుతుండడంతో ప్రభుత్వం ఎట్టకేలకు మెట్టు దిగివచ్చింది. కార్మికల సంఘాల రాష్ట్రస్థాయి నేతలతో బుధవారం చర్చలు జరిపింది. కొన్ని డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించడంతో కార్మికులు సమ్మెను తాత్కాలికంగా విరమించి గురువారం నుంచి విధులకు హాజరవుతారని జీవీఎంసీ అనకాపల్లి జోన్ మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు గంటా శ్రీరామ్ తెలిపారు. ప్రభుత్వం ఆమోదించిన అంశాలపై సత్వరమే జీవో విడుదల చేయాలని, లేకపోతే కార్మికులు మళ్లీ సమ్మెకు దిగుతారని ఆయన స్పష్టం చేశారు.

అనకాపల్లి నియోజకవర్గం

క్రీడల్లో డీవీఎన్ కళాశాల విద్యార్థి ప్రతిభ

అనకాపల్లి టౌన్, జనవరి 10 : పట్టణంలోని డీవీఎన్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సిరవెల్ల బాలసాయి చరణ్ ఆంధ్రా యూనిర్సిటీలో సోమ, మంగళవారాల్లో జరిగిన ఇంటర్ కో లీగ్ పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ చాటాడు. బాడీ బిల్డింగ్‌లో బంగారు పతకం, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా అతనిని దాడి విద్యాసంస్థల చైర్మన్ దాడి రత్నాకర్, డీవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి తదితరులు అభినందించారు.

'వికసిత్ భారత్' లక్ష్యసాధనకు యువత కృషి చేయాలి : డీఆర్‌డీఏ పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న శచీదేవి

అనకాపల్లి టౌన్, జనవరి 10 : వికసిత్ భారత్ లక్ష్యం సాధనకు యువత కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ కాండ్రేగుల శచీదేవి పిలుపునిచ్చారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన డిబేట్‌లో ఆమె యువతను ఉద్దే శించి మాట్లాడారు. వ్యక్తిత్వ వికాసంలో విద్యా సంస్థల పాత్ర కీలకమన్నారు. నీటి సంరక్షణ, విద్యుత్తు ఆదా, వ్యవసాయంలో తక్కువ రసాయనాలను ఉపయోగించడం, ప్రజా రవాణాను ఉపయోగించడం ద్వారా సహజ వనరుల సంరక్షణకు దోహదపడాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన విభాగం అధికారి గొర్లి మహేశ్వరరావు, రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, గౌరీ గ్రం థాలయం మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సభ్యులు మారిశెట్టి శివరామకృష్ణ, బొడ్డేడ జగ్గఅప్పారావు, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్.వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు పీడీ శచీదేవి జ్ఞాపికలను అందజేశారు.

ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ కార్యాలయం ప్రారంభం

అనకాపల్లి టౌన్, జనవరి 10 : ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ కార్యాలయం బుధవారం ఇక్కడ ప్రారంభమైంది. లక్ష్మీనారాయణనగర్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కర్రి ఆదిబాబుతో పాటు ఆలిండియా బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు విల్లూరి పైడారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు నీరు, నిధులు, నియామకాలు సాధించుకోవాలంటే తమ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టా రామారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తమ పార్టీ 53 అసెంబ్లీ స్థానాల్లో, ఎనిమిది ఎంపీ స్థానాల్లోను పోటీ చేయనుందన్నారు. పార్టీ కార్యదర్శి ఎద్దు శ్రీలక్ష్మి, కోన రామారావు, ఆళ్ల రామకృష్ణ, మెట్టా మాధవి, శ్రీరామచంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అలుపెరుగని పోరు



అనకాపల్లిలో మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు



పరవాడలో ఒంటికాలిపై నిలబడి దండం పెడుతూ...

అనకాపల్లి టౌన్, జనవరి 10 : డిమాండ్ల పరిష్కారానికి అంగన్‌వాడీలు వివిధ రూపాల్లో ఆందోళనలను ఉధృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని నెహ్రూచౌక్‌లో గల బస్టాప్ వద్ద ఏర్పాటైన శిబిరంలో సోమవారం మెడకు తాళ్లు బిగించుకుని ఉరిపోసుకుంటున్నట్టు నిరసన తెలియజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, ఎస్మా జీవోను ఉపసంహరించుకోవాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలు, టీఏ బిల్లులు, ఇతర బకాయిలు తక్షణమే చెల్లించాలని వారంతా నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు ఉమా నారాయణమ్మ, కృష్ణవేణి, కాసులమ్మ, తనూజ, ధనలక్ష్మి, సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, సుభాషిణి పాల్గొన్నారు.

పరవాడ : డిమాండ్లు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన ఉధృతమవుతోంది. ఇందులో భాగంగా బుధవారం ఇక్కడ ఒంటికాలి నిల్చొని దండం పెడుతూ నిరసన తెలియజేశారు. అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు సీహెచ్.దేవి, ఎం.రమణి, వరలక్ష్మి, కుమారి, అమ్మాజీ ఈశ్వరమ్మ, అక్కులమ్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని పలువురు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు బుధవారం సీడీపీవో లలితకుమారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సచివాలయ సిబ్బంది అయిన గ్రామ పోలీసు, వీఆర్వోలు పలువురు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఇళ్లకు వెళ్లి గోడలకు షోకాజ్ నోటీసులు అంటించారు. గుల్లేపల్లి, సబ్బవరం, పెదగొల్లలపాలెం సెక్టార్లలో 84 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో టీచర్లు, హెల్పర్లు సుమారు 130 మంది పని చేస్తున్నారు. వీరిలో ఇప్పటి వరకూ సుమారు 60 మంది అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారని ప్రాజెక్టు అధ్యక్షురాలు వివి రమణమ్మ తెలిపారు.

పారిశుధ్య కార్మికులు ఆందోళన

అనకాపల్లి టౌన్, జనవరి 10 : జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల ఆందోళన బుధవారం ఇక్కడ కొనసాగింది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని వంటి డిమాండ్లతో శిబిరంలో నినాదాలు చేశారు. ఇదిలావుంటే, బుధవారం సాయంత్రం సమ్మె ముగిసినట్టు సమాచారం.

షటిల్ ఇండోర్ స్టేడియం ప్రారంభం

అనకాపల్లి టౌన్, జనవరి 10 : పట్టణంలోని జార్జిక్లబ్ ఆవరణలో నిర్మించిన షటిల్ ఇండోర్ స్టేడియాన్ని జగన్నాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ శరగడం శ్రీరామచంద్రమూర్తి బుధవారం ప్రారంభించారు. అలాగే ఆయన సతీమణి మహాలక్ష్మి విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, డాక్టర్ కె.విష్ణుమూర్తి, కె.జగదీష్, దిలీప్‌కుమార్, జార్జిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాశీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనకాపల్లిలో ఘనంగా 'సలార్' సంబరాలు

తుమ్మపాల, జనవరి 10 : దేశవ్యాప్తంగా విడుదలైన 'సలార్' చిత్రం 18 రోజులకు రూ.659 కోట్ల గ్రాస్ వసూలు చేయడంతో బుధవారం అనకాపల్లి రామచంద్ర థియేటర్ వద్ద అనకాపల్లి ప్రభాస్ ఫ్యాన్స్ గౌరవాధ్యక్షుడు ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు థియేటర్ మేనేజర్ మళ్ల వెంకటరావును గజమాలతో సత్కరించారు. ప్రభాస్ ఫ్యాన్స్ సభ్యులు ఆళ్ల ప్రసాద్, కర్రి ప్రసాద్, గుర్రం ఈశ్వరరావు, వేగి సాయి పాల్గొన్నారు.

వేతన జీవుల ఇక్కట్లు

... 5వ పేజీ తరువాయి

అందాయని, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేయడంతో పదో తేదీకి అటుఇటుగా అందుతున్నాయని చెప్పారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె

వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పని చేస్తున్న ఉద్యోగులకు కూడా సకాలంలో వేతనాలు చెల్లించడం లేదు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. అంగన్‌వాడీలు నెల రోజుల నుంచి రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వ పెద్దలు ప్రతిపక్షంలో వున్నప్పుడు ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్ల నుంచి అమలు చేయకపోగా, ఇప్పుడు సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తున్నది. పైగా తక్షణమే విధుల్లోకి చేరాలని, లేకుండా ఉద్యోగం నుంచి తొలగించాల్సి వస్తుందంటూ అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు గత నెల 20వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారు. వీరి సమస్యలను సానుకూల దృక్పథంలో పరిష్కరించకపోగా, పుండు మీద కారం చల్లిన చందంగా కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచర్లను విధులను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మూడో జాబితాపై వైసీపీలో టెన్షన్

... 5వ పేజీ తరువాయి

బుధవారం ఉదయం నుంచి ప్రచారం జరిగింది. వైసీపీ అధిష్ఠానం జరిపించిన అనేక సర్వేల్లో ఎంపీ డాక్టర్ సత్యవతికి వ్యతిరేకంగా రిపోర్టులు అందాయని తెలిసింది. ఎంపీ అనకాపల్లి మినహా మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్దగా పర్యటించడం లేదని, సొంత పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలతో సఖ్యత లేదన్న అంశాలు పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. దీంతో వచ్చే ఎన్నికల్లో ఆమెకు టికెట్ కష్టమేనని కొద్దికాలంగా పార్టీ వర్గాలే పేర్కొంటూ వస్తున్నాయి. ఈ విషయం తెలుసుకున్న సత్యవతి రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి జగన్‌ను కలిసేందుకు తాడేపల్లి వెళ్లినట్టు సమాచారం. మరోసారి ఎంపీగా పోటీ చేయడానికి అవకాశం ఇవ్వాలని, ఒకవేళ వీలుకాకపోతే జిల్లాలో ఏదైనా ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరినట్టు సమాచారం. ఇదిలావుండగా విశాఖకు చెందిన కిలారి పద్మ అనే మహిళ పేరును కూడా వైసీపీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

పెందుర్తి నియోజకవర్గం

క్రీడా పోటీలు ప్రారంభం



సబ్బవరంలో వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ

పరవాడ, జనవరి 10 : క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల ప్రత్యేకాధికారిణి డైసీ తెలిపారు. బుధవారం భరిణికం గ్రామ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మండల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాంబాబు, డ్వాక్రా ఏపీఎం జి.కనకమ్మ, మండల ఇంజనీర్ రామారావు, కార్యదర్శులు అచ్యుతరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

సబ్బవరం : ఆడుదాం ఆంధ్రలో భాగంగా ఇక్కడ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ బోకం సూర్యకుమారి ప్రారంభించారు. ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఏవో షేక్ బాబూరావు, సర్పంచ్ దెడ్డం ప్రసాద్, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, బోకం రామునాయుడు, కర్రి బాబు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి'

పరవాడ, జనవరి 10 : కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగపరుచుకోవాలని బీజేపీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లి రామునాయుడు పిలుపునిచ్చారు. బుధవారం వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమశేఖర్, రామకృష్ణ, అప్పలనాయుడు, వెన్నెల నూకరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తున్న వారిలో 22 మందికి బుధవారం ఐసీడీఎస్ సీడీపీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీటిని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో గోడలకు అతికించారు. మిగిలిన వారికి గురు, శుక్రవారాల్లో షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్టు చెప్పారు. నోటీసులు జారీ చేసిన పది రోజుల్లో విధులకు హాజరు కావాలని, లేకపోతే విధుల నుంచి తొలగించాల్సి వుంటుందని నోటీసుల్లో హెచ్చరించారు. కాగా ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు మండిపడుతున్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం వైసీపీ ప్రభుత్వానికి తగదని అన్నారు. తమ డిమాండ్‌లను ఆమోదించే వరకు సమ్మె విరమించేది లేదని, అవసరమైతే విపక్షాల సాయంతో రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

పాయకరావుపేట నియోజకవర్గం



జయహో బీసీ చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న విజయ్

టీడీపీకి వెన్నుముక బీసీలు

చైతన్య రథాన్ని ప్రారంభించిన చింతకాయల విజయ్

నక్కపల్లి, జనవరి 10: తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నుముకగా నిలుస్తున్నారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. బుధవారం నక్కపల్లి సమీపాన తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆధ్వర్యంలో జయహో బీసీ చైతన్య రథాన్ని విజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు టీడీపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. వైసీపీ పాలనలో కక్ష సాధింపు చర్యలు, విధ్వంసం, అక్రమ కేసులు, వేధింపులే కనబడుతున్నాయని పేర్కొన్నారు. మరో మూడు నెలల్లో జగన్ మాజీ సీఎం అవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నక్కపల్లి, ఎస్.రాయవరం మండల శాఖల అధ్యక్షులు వెంకటేష్, అబద్ధం, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, టీడీపీ నాయకులు గింజాల లక్ష్మణరావు, గుర్రం రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఆండాలమ్మ నీరాటోత్సవాలు



పాండురంగస్వామి ఆలయంలో ఆండాలమ్మవారు

పాయకరావుపేట, జనవరి 10: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పాండురంగస్వామి ఆలయంలో బుధవారం ఆండాళ్లమ్మవారి నీరాటోత్సవాలు ఘనంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. భోగి పండుగ వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రధానార్చకులు కృష్ణస్వామి ఆండాలవ్మ వారిని నూతన వస్త్రాలతో సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎన్.వెంకటాద్రి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకుపాత్రులు కావాలని వారు కోరుతున్నారు.

మండల స్థాయి పోటీలు ప్రారంభం

పాయకరావుపేట, జనవరి 10: పాయకరావుపేటలో నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్ర ఆటల పోటీల్లో భాగంగా బుధవారం మండల స్థాయి పోటీలు ప్రాంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలను వైసీపీ మండల మాజీ అధ్యక్షులు ధనిశెట్టి బాబూరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు కాదా రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎ.సాంబశివరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే మండల స్థాయి వాలీబాల్, కబడీ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మండలంలో 24 గ్రామాల నుంచి 24 టీమ్‌లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్ర మండల ఇన్‌చార్జి టి.రవికుమార్‌తో పాటు ఎంఈఓ కేఎస్.గాంధీ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలపడమే.. పరిష్కారం లేదు!

» రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం



మండల సమావేశంలో కార్యక్రమాల వివరాలు తెలుపుతున్న వ్యవసాయాధికారి

రాంబిల్లి, జనవరి 10: ప్రతీ సర్వసభ్య సమావేశంలో సమస్యలను తెలపడమే తప్పితే పరిష్కారానికి నోచుకోవడం లేదని సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ జి.శిరీషాశ్రీనుబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కరెంట్ సమస్యలు అధికంగా ఉన్నప్పుడు విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్‌లు చేస్తున్నా స్పందించడం లేదని పలు గ్రామాల సర్పంచులు తెలిపారు. శాఖాపరంగా పంచాయతీల్లో సమస్యలను గతంలో తెలిపినప్పటికీ కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించనప్పుడు అధికారులకు చెప్పుకోవడం ఎందుకని సభ్యులు ప్రశ్నించారు. కట్టుబోలు రెవెన్యూల్లో సర్వే నంబరు 28/2లో మూడు ఎకరాల 40 సెంట్లు భూమి తనకు ఉందని, సమగ్ర సర్వేలో 22 సెంట్లు తగ్గించి తనకు పట్టాదారు పాస్ పుస్తకం ఇచ్చారని, ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు తెలిపినా చర్యలు లేవని వైస్ ఎంపీపీ కె.లక్ష్మి తెలిపారు.

అనంతరం ఎంపీపీ జి.శిరీషాశ్రీనుబాబు స్పందిస్తూ ప్రజా ప్రతినిధులు తెలిపిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికారుల దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను ఎంతవరకు పరిష్కరించారని ప్రశ్నించారు. వీటి వివరాలను తనకు తెలియజేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు ధూళి నాగరాజు, వైస్ ఎంపీపీలు కశిరెడ్డి నరసింగరావు, కొటాపు లక్ష్మి, ఎంపీడీవో కొండలరావు, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించండి

» నక్కపల్లి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

నక్కపల్లి, జనవరి 10: మండలంలో అనేక గ్రామాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించాలని సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పెదతీనార్లలో సుమారు మూడు ఎకరాల అటవీ, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని, తక్షణమే ఆక్రమణలను తొలగించాలని ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు కోరారు. గ్రామాల్లో వ్యవసాయ శాఖ కార్యక్రమాలు, సమావేశాలకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు చెప్పారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్లు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయాలని ఏవో ఉమా ప్రసాద్‌ను కోరారు. ఉపమాక గ్రామంలో డంపింగ్ యార్డు నిర్వహణకు అవసరమైన స్థలం ఇవ్వాలని ఇన్‌చార్జి సర్పంచ్ ప్రగడ వీరబాబు కోరారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇంటి స్థలాల కోసం అవసరమైన భూమిని సిద్ధం చేయాలని తహసీల్దార్ అంబేద్కర్‌ను కోరారు. రేషన్‌లో పంచదార, కందిపప్పు అరకొరగా ఇస్తున్నారని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాగిత ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు చెప్పారు. నక్కపల్లి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన స్టెమీ రూమ్ గురించి సూపరింటెండెంట్ డాక్టర్ ఈశ్వర ప్రసాద్ వివరించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో డి.సీతారామరాజు, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సర్పంచులు రెడ్డి వరహాలు, మున్నీషా బేగం, కాళ్ల శ్రీను, వెంకటేష్, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, లొడగల చంద్రరావు, తదితరులు పలు సమస్యలపై మాట్లాడారు.

విహారంలో విషాదం

» రోడ్డు రోలర్‌ను ఢీకొన్న బైక్.. ఇద్దరు డిగ్రీ విద్యార్థుల మృతి

» అరకులోయ నుంచి పాడేరు వెళుతుండగా ప్రమాదం

» మృతులిద్దరూ సాలూరు మండలం నడిమివలస వాసులు



రవితేజ... మెలిక వాసు (ఫైల్ ఫొటోలు)

అరకులోయ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మన్యంలో పర్యాటక ప్రదేశాలను తిలకించేందుకు వచ్చిన ఇద్దరు డిగ్రీ విద్యార్థులు బుధవారం సాయంత్రం డుంబ్రిగుడ మండలం కురిడి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతులు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం నడిమివలస గ్రామానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం...నడిమివలస గ్రామానికి చెందిన పీదరపు రవితేజ (20), మెలిక వాసు (20)లు విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతున్నారు. విహారయాత్రకని రవితేజ, వాసులు మరో నలుగురు తోటి విద్యార్థులతో కలిసి మూడు బైక్‌లపై బుధవారం అరకులోయ చేరుకున్నారు. ఇక్కడ సందర్శనీయ ప్రదేశాలను తిలకించి రాత్రికి పాడేరు చేరుకుని, అక్కడ బస చేసి గురువారం తెల్లవారుజామున వంజంగి హిల్స్‌కు వెళ్లాలని భావించారు. పగలంతా అరకులోయ పరిసరాలను చూసి సాయంత్రం పాడేరు బయలుదేరారు. ఈ క్రమంలో డుంబ్రిగుడ మండలం కురిడి వద్ద నిలిచివున్న రోడ్డు రోలర్‌ను రవితేజ, వాసు ప్రయాణిస్తున్న బైక్ బలంగా ఢీకొంది. దీంతో రవితేజ అక్కడికక్కడే మృతిచెందగా, వాసుకు తీవ్రగాయాలు కావడంతో అరకులోయ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌కు దండాలు పెడుతూ అంగన్‌వాడీల నిరసన



దండంపెట్టి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అచ్యుతాపురం, జనవరి 10: జగనన్నా నీకో దండమన్నా.. మా వైపు చూడన్నా! అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. డిమాండ్ల సాధనకు వారు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమను నమ్మించి మోసం చేశారంటూ నినాదాలు చేశారు. తమ కోర్కెలు తీరే వరకు ఎటువంటి బెదిరింపులకు లొంగకుండా ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

రాంబిల్లిలో కొనసాగుతున్న సమ్మె



రాంబిల్లిలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

రాంబిల్లి, జనవరి 10: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 30వ రోజుకు చేరింది. వీరి ఆందోళనకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెదిరింపులతో ఉద్యమాలను ప్రభుత్వం ఆపలేదన్నారు. ప్రభుత్వం మొండి పట్టుదల వీడి అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, అంగన్‌వాడీలు, సహాయకులు పాల్గొన్నారు.

ఎలమంచిలి నియోజకవర్గం

పాదయాత్రికులకు ఘన స్వాగతం

ఎలమంచిలి, జనవరి 10: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సీఎం కావాలని కోరుతూ ఇచ్ఛాపురం నుంచి తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్న బృందానికి ఎలమంచిలిలో ఘన స్వాగతం పలికారు. ఇచ్ఛాపురంకు చెందిన ఆరుగురు బృంద సభ్యులకు ఎలమంచిలిలో టీడీపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం వీరి పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ బృంద సభ్యులతో పాటు నాయకులు లైనుకొత్తూరు వరకూ పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆడారి రమణబాబు, బొద్దపు శ్రీను, పందూరి శ్రీను, గొర్లె బాబూరావు, దాడిశెట్టి పైడయ్య, సాగర్‌హుస్సేన్, నానేపల్లి సుబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిత: ఎంపీపీ గోవింద్

ఎలమంచిలి, జనవరి 10: విద్యతో పాటు క్రీడా రంగంలోనూ రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఎలమంచిలి రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో బుధవారం ఆడుదాం-ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభను ప్రదర్శించి సోదరతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. క్రీడా రంగాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొండబాబు, స్థానిక నాయకులు గొర్లె వెంకట్, మర్రి రాజు పాల్గొన్నారు.

మునగపాకలో ధాన్యం కొనుగోలు కేంద్రం

మునగపాక, జనవరి 10: స్థానిక మునగపాక కోపరేటివ్ సొసైటీలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. క్వింటాల్‌కు కామన్ రకానికి రూ.2183 రూపాయలు, గ్రేడ్-ఏ కు రూ.2203 రూపాయల మద్దతు చెల్లించనున్నట్టు మండల వ్యవసాయ అధికారిణి సీహెచ్ జ్యోత్స్న తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు సూరిశెట్టి రాము, గణేష్, వైసీపీ మండల అధ్యక్షుడు ఎ.అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు రామ్మోహన్, ఏఈవో లక్ష్మి పాల్గొన్నారు.

ఆడుదాం-ఆంధ్రాతో గ్రామీణ క్రీడాకారులకు మేలు

మునగపాక, జనవరి 10: ఆడుదాం-ఆంధ్రా పోటీలతో గ్రామీణ క్రీడాకారులకు మేలు చేకూరుతుందని ప్రత్యేకాధికారి, హౌసింగ్ గృహ నిర్మాణ శాఖ పీడీ రమామణి చెప్పారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో నైపుణ్యం ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడానికి సీఎం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యులు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యులు సూరిశెట్టి రాము, బి.గణేష్, ఎం.వీరునాయుడు, రామ్మోహన్ పాల్గొన్నారు.

దేవరాపల్లిలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్.ఐ.నాగేంద్ర, ఇన్‌చార్జ్ సీఐ కుమారస్వామి, తహసీల్దార్ ఎం.లక్ష్మి, చోడవరం అగ్నిమాపక శాఖ అధికారులు ఇక్కడకు వచ్చారు. వాటర్ ట్యాంకు దిగి తమ సమస్యలు చెప్పుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులు వచ్చి సమాధానం చెప్పే వరకు కిందకు దిగేది లేదని రైతులు స్పష్టం చేశారు. దీంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మ.. గురువారం రైతులతో చర్చలు జరుపుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.కార్యదర్శి ఉమాదేవీ, విఆర్వో తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

బాలికపై అత్యాచారం కేసులో

ఇద్దరి అరెస్టు

» అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ వెల్లడి

చింతపల్లి, జనవరి 10: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని ఒక గిరిజన గ్రామంలో పదకొండేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ తెలిపారు. సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల రెండో తేదీ ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను అదే గ్రామానికి చెందిన పాంగి రమేశ్ (19) చేయి పట్టుకుని పక్కనే ఉన్న ఇంట్లోకి లాక్కెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. ఈ విషయం బాలిక బయటకు చెబుతుందనే భయంతో తన స్నేహితుడు గెమ్మెలి సీతన్నతో కలిసి హత్య చేయాలని నిర్ణయించుకున్నాడన్నారు. గంటల వ్యవధిలోనే బాలిక ఇంట్లోకి వెనుక నుంచి ప్రవేశించారని, ఆమె రక్షించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఛాతీపై రమేశ్ బలంగా తన్నడంతో కింద పడిపోయిందన్నారు. బాలికను చంపే ముందు రమేశ్, సీతన్న అత్యాచారం చేశారన్నారు. అనంతరం గొంతు నులిమి చంపి, దూలానికి చున్నీతో ఉరి వేసుకున్నట్టుగా సీన్ చిత్రీకరించి వెళ్లిపోయారన్నారు. పొలం నుంచి ఇంటికి వచ్చిన బాలిక తల్లిదండ్రులు...కుమార్తె ఉరి వేసుకుని ఉండడం చూసి కన్నీరుమున్నీరుగా విలపించి మరుసటిరోజు సమాధి చేశారన్నారు. అయితే బాలికను రమేశ్ చేయిపట్టుకుని పక్క ఇంట్లోకి తీసుకువెళ్లడాన్ని చూసిన చుట్టుపక్కల పిల్లలు విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు చెప్పారని, దీంతో వారు ఈ నెల ఐదో తేదీన జీకే వీధి పోలీసులకు ఫిర్యాదు చేశారని అదనపు ఎస్పీ వివరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు ఆరో తేదీన వైద్యులు, రెవెన్యూ అధికారులతో గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించినట్టు చెప్పారు. అత్యాచారం జరిగిందని, ఆపై హత్య చేశారని పోస్టుమార్టం నివేదికలో నిర్ధారణ జరిగిందని చెప్పారు. దీంతో నిందితులు రమేశ్, సీతన్నలపై అత్యాచారం, హత్య, పోక్సో చట్టాల కింద కేసు నమోదు చేశామన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచామన్నారు. ఈ సమావేశంలో సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మృతి

అచ్యుతాపురం, జనవరి 10: మండలంలో బుధవారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మృతిచెందారని సీఐ బుచ్చిరాజు, ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. హరిపాలేనికి చెందిన రైతుకూలి సియాద్రి తాతబ్బాయి(57) తిమ్మరాజుపేటలోగల చెరుకు తోటలో పనిచేయడానికి వెళ్లి పాము కాటుకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలించేలోగా మృతిచెందాడు. ఇతని కుమారుడు గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. అలాగే దొప్పెర్ల పంచాయతీ సబ్బవరపు కొంపలుకి చెందిన సబ్బవరపు నాగేంద్ర(32) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి రెండేళ్ల క్రితం వివాహం కాగా, 8 నెలల పాప ఉంది. దీనిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి

» ఏఐవైఎఫ్ అధ్యక్షుడు కన్నబాబు డిమాండ్



నెహ్రూచౌక్‌లో నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

తుమ్మపాల, జనవరి 10 : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని ఏఐవైఎఫ్ అధ్యక్షుడు కన్నబాబు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ నాయకులతో కలిసి బుధవారం పట్టణంలోని నెహ్రూచౌక్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి నీళ్లతో అభిషేకం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్రలో నిరుద్యోగులకు హామీలు ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. పరిశ్రమల మంత్రి హోదాలో ఉన్న గుడివాడ అమర్‌నాథ్ రాష్ట్రానికి ఏ ఒక్క పరిశ్రమను తీసుకు రాలేదని ఆరోపించారు. ఏఐవైఎఫ్ నాయకులు వియ్యపు రాజు, రేఖా సంతోష్, భరిణికాన సాయి, బోరా రాజేష్, ఒమ్మి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు గురువారం ఉదయం పది గంటలకు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరుగుతాయని సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. ఉదయం 10 గంటలకు రెండు, 10.30 గంటలకు ఐదు, మధ్యాహ్నం 12 గంటలకు 4, 6, మూడు గంటలకు 1,3,7 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు.

అప్పన్న సన్నిధిలో సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు

» దర్శన వేళల్లో స్వల్ప మార్పులు

సింహాచలం, జనవరి 10: సింహాచలం దేవస్థానంలో సంక్రాంతి సంబరాలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మాడవీధులను రంగవల్లులతో శోభాయమానంగా తీర్చిదిద్దడంతో పాటు పల్లె వాతావరణం ఉట్టిపడేలా పూరి గుడిసెలు నిర్మిస్తున్నారు. అలాగే భోగి మంట వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భోగి రోజున సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య అప్పన్న ఆలయంలో గోదారంగనాథుల కల్యాణం జరగనుంది. ఆ రోజు ఉదయం జరగాల్సిన స్వామివారి నిత్య కల్యాణం కూడా సాయంత్రం చేయనున్నారు. 15న మకర సంక్రాంతి పురస్కరించుకుని ఉత్తరాయన పుణ్యకాలం ప్రత్యేక పూజలు జరగనుండడంతో ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య భక్తులకు దర్శనాలు లభించవు. కనుమ రోజున సాయంత్రం కొండ దిగువన స్వామివారి ఉద్యానవనంలో గజేంద్రమోక్షోత్సవం జరగనుంది. ఆ రోజు సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయి. 6 తరువాత నుంచి మరుసటి రోజు ఉదయం ప్రభాత ఆరాధనల తరువాత యథావిధిగా భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. ఆలయంలో పలు వార్షికోత్సవాలు జరగాల్సి ఉండడంతో ఈనెల 11 నుంచి 17 వరకు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నామని, సాయంత్రం 7 గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయని ఈఓ చెప్పారు. అలాగే ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 12న కూడారై ఉత్సవం పురస్కరించుకుని ఉదయం 8.30 నుంచి 9. 30 గంటల వరకు దర్శనాలు నిలిపివేస్తామని చెప్పారు.

కిరండోల్ రైళ్లు జగదల్‌పూర్ వరకే

విశాఖపట్నం, జనవరి 10: కేకే లైనులో దంతెవాడ- కామలూర్ స్టేషన్ల మధ్య భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లను విశాఖ, జగదల్‌పూర్ మధ్య నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 18514 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్, 08551 నంబరు గల డే ఎక్స్‌ప్రెస్ ఈనెల 10,11వ తేదీల్లో విశాఖ నుంచి జగదల్‌పూర్ వరకు...తిరుగు ప్రయాణంలో 18513 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్, 08552 నంబరు గల డే ఎక్స్‌ప్రెస్ ఈనెల 11, 12వ తేదీల్లో జగదల్‌పూర్‌లో బయలుదేరి విశాఖ చేరుతాయని పేర్కొన్నారు. జగదల్‌పూర్-కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

గోదాదేవి నీరాటోత్సవాలు


నీరాటోత్సవాల్లో భాగంగా గోదాదేవి అమ్మవారి తిరువీధి సేవ

నక్కపల్లి, జనవరి 10: ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంతో బుధవారం గోదాదేవి అమ్మవారి నీరాటోత్సవాలను ఆలయ అర్చకులు ఘనంగా ప్రారంభించారు. ముందుగా గోదాదేవి అమ్మవారిని ఆలయానికి అనుకుని వున్న పుష్పతోటలోకి తీసుకు వెళ్లారు. ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు ప్రత్యేక పూజలు చేసి, తిరుప్పావై పాశుర విన్నపం చేసి హారతులిచ్చారు. అనంతరం రాజాధిరాజ వాహనంలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి తిరువీధి సేవ చేశారు.

ఉపమాకలో నగర సంకీర్తన

కాకినాడ జిల్లా కత్తిపూడికి చెందిన సుమారు 200 మంది భక్త బృందం బుధవారం ఉదయం ఉపమాక క్షేత్రానికి వచ్చి, మేలుకొలుపు ఉత్సవంలో భాగంగా మాడవీధుల్లో నగర సంకీర్తన చేశారు. కత్తిపూడి వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ కేలంగి నూకరాజు, హరినాథ్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది భక్తులు ఉపమాక వచ్చారు. శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు తదితరులు వారికి ఘన స్వాగతం పలికారు.

సింహాద్రి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

» టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల



టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజును సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

పరవాడ, జనవరి 10: సింహాద్రి ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు హామీ ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి చిత్తూరు జిల్లా కుప్పం వరకు తలపెట్టిన కార్మిక చైతన్యయాత్ర బుధవారం సింహాద్రి మెయిన్‌గేటు వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు టీఎన్‌టీయూసీ, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రఘురామరాజు మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు బీమా వర్తించేలా చూస్తానన్నారు. స్పెషల్ అలవెన్సు చెల్లింపులతో పాటు ఈఎస్ఐ అమలు జరిగేలా యాజమాన్యంతో మాట్లాడుతానన్నారు. కార్మికులపై వేధింపులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయనను టీఎన్‌టీయూసీ, టీడీపీ నాయకులు కలిసి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాసవరపు అప్పలనాయుడు, రొంగలి గోపాలకృష్ణ, ఇందల కొండలరావు, వియ్యపు చిన్న, పైలా వరలక్ష్మి, శివలంక లక్ష్మి, పార్వతి, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై నిలదీత

» మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు


ఇసుక అక్రమ తవ్వకాలపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

కోటవురట్ల, జనవరి 10: వరహా నదిలో రేయింబవళ్లు ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని అధికారులను జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు సూర్యారావు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమాదేవి, సూర్యారావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇస్తున్నామని ఇసుక తరలించే టైరు బండ్ల యజమానులు బహిరంగంగా చెబుతున్నా ఎందుకు స్పందించడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల పంట పొలాలు, వంతెన దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కొళాయి ఏర్పాటు పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల నాణ్యత లేకుండాపోయాయన్నారు. సన్యాసిరాజుపాలెం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు హరికృష్ణ పాఠశాలకు వస్తున్నారో?, రావడం లేదో? తెలియడం లేదని ఎప్పుడూ స్కూల్‌కు తాళాలు వేసి ఉంటున్నా యని ఎంఈవోకు టీకే పల్లి ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి సురక్షిత తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను చౌడువాడ సర్పంచ్ గోపాలం కోరారు. ఎంపీటీసీ సభ్యుడు సూర్యారావు మాట్లాడుతూ రంగు మారిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవడం లేదని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాగా ఈ సమావేశానికి వైస్ ఎంపీపీ చెక్కా సుజాత, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకాకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ సమావేశంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ తీర్మానం లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం

» నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక సంఘం నిధులు వినియోగం

» ఎంపీడీవోను నిలదీసిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు


ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలతో మాట్లాడుతున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథం

కోటవురట్ల, జనవరి 10: గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా ఆర్థిక సంఘం నిధులతో మండల పరిషత్ ప్రాంగణంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ సర్పంచ్ బి.అనిల్‌కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి, వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేశ్ బుధవారం ఎంపీడీవో కాశీవిశ్వనాథంను నిలదీశారు. మండల పరిషత్‌కు 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధుల నుంచి రూ.4.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్న విషయం తెలుసుకుని వారు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. గ్రామపంచాయతీ తీర్మానంతోపాటు ఎస్టిమేషన్, వర్క్‌ఆర్డర్ లేకుండా పనులు ఎలా మొదలుపెట్టారని ప్రశ్నించారు. ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారం తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ పనులకు వినియోగించాలి. ఇందుకు విరుద్ధంగా సీసీ రోడ్డు నిర్మాణానికి వినియోగించడంపై ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం దీనిపై మండల ఇంజనీర్ వర్మను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. సీసీ రోడ్డుకు ఎస్టిమేషన్ వేసి, వర్క్ ఆర్డర్ అనుతులతోనే పనులు చేయిస్తుమన్నారు. పంచాయతీ తీర్మానం కోసం ఎంపీడీవో లేఖ ఇచ్చారని చెప్పారు.

పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 10: జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. శంకరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేస్తూ పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను అనుసరించి ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రతి విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. బూత్‌స్థాయి అధికారులు తప్పిదాలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది రాజకీయ పార్టీల నమ్మకం కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో దయానిధి, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తునిలో చంద్రబాబు సభకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు


పాయకరావుపేట నుంచి తరలివెళుతున్న టీడీపీ శ్రేణులు

పాయకరావుపేట, జనవరి 10: కాకినాడ జిల్లా తునిలో బుధవారం జరిగిన 'రా కదలిరా.. తెలుగుదేశం పిలుస్తోంది' బహిరంగ సభకు పాయకరావుపేట నుంచి టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాల్గొన్న ఈ సభకు టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో పాయకరావుపేట పట్టణంతో పాటు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. వీరిలో పార్టీ నాయకులు పల్లా విలియంకేరీ, లెక్కల గోవిందు, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు, భాస్కర చౌదరి, ఆది, ఎం.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...


టీడీపీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, జనవరి 10 : జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ సర్వనాశనమయ్యాయని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. కశింకోట మండలం కన్నూరుపాలెంలో బుధవారం వైసీపీ నుంచి పలువురు నాయకులు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నియంత పోకడలతో విసుగుపోయిన వైసీపీ నాయకులంతా టీడీపీ వైపు ఆసక్తి చూపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళీ, కూండ్రపు రామునాయుడు, కూండ్రపు అక్కునాయుడు, వర్రి పోతురాజు, సిరికి సన్యాసినాయుడు, కన్నూరు ఎర్రినాయుడు, సీహెచ్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'వాసుదేవరావు కుటుంబాన్ని ఆదుకుంటాం'

మునగపాక, జనవరి 10: సమగ్ర శిక్ష ఉద్యోగి వాసుదేవరావు కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు అన్నారు. బుధవారం వాసుదేవరావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అనకాపల్లి డీఈవో కార్యాలయం ముందు దీక్ష చేస్తుండగా ఉద్వేగానికి లోనై వాసుదేవరావు బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చేరి మృతి చెందినా ప్రభుత్వం స్పందకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.కిశోర్‌కుమార్, బి.శ్రీనివాసరావు, కర్రి లక్ష్మీనారాయణ, బొడ్డేడ అర్జునకృష్ణ, శంకరరావు, రాపేటి సత్తిబాబు, ఆళ్ల మహేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం

» అంగన్‌వాడీలకు బుద్ద నాగజగదీశ్వరరావు హామీ


అంగన్‌వాడీ శిబిరంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

అనకాపల్లి టౌన్, జనవరి 10: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు హామీ ఇచ్చారు. బుధవారం నెహ్రూచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీల శిబిరానికి ఆయన హాజరై వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అంగన్‌వాడీల వేతనాలు పెరిగాయన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ ఇచ్చిన మాటను తుంగలోకి తొక్కారన్నారు. అంగన్‌వాడీలకు అండగా తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ఉంటుందని, అధికార పార్టీ నాయకులు ఎవరైనా ఇబ్బందులు పెడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించి సమ్మెను నిషేధించడమంటే ప్రజా హక్కులపై దాడి చేయడమే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆడారి కిశోర్‌కుమార్, కుప్పిలి జగన్మోహన్, మళ్ల గణేశ్, కాండ్రేగుల సత్యనారాయణ, పూడి రమణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె విరమించేది లేదు

» సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు


రిలే నిరాహారదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి రూరల్, జనవరి 10 : జిల్లాలోని అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మె బుధవారానికి 30వ రోజుకు చేరింది. అంగన్‌వాడీల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 24 గంటల దీక్షను శంకరంలోని కలెక్టరేట్ వద్ద కొనసాగిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి అంగన్‌వాడీలు తరలివచ్చి దీక్షలో పాల్గొన్నారు. అనంతరం సుమారు 20 మంది అంగన్‌వాడీలు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం సాగిస్తున్నారని, వాటి పరిష్కారానికి కృషి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తున్నదని ధ్వజమెత్తారు. అంగన్‌వాడీలపై అత్యవసర సేవల చట్టం ఎస్మా ప్రయోగించడం అన్యాయమన్నారు. బుధవారం ఉదయం నుంచి ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చి విధులకు హాజరుకావాలని ఒత్తిళ్లు చేస్తున్నా సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని ఆయన తెలిపారు. ఈ దీక్షకు రావికమతం, మాడుగుల మండలాల అంగన్‌వాడీలు తరలివచ్చారు.

ప్రభుత్వం నుంచి స్పందన వచ్చే వరకు సమ్మె



నిరసన శిబిరంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

అనకాపల్లి రూరల్, జనవరి 10: జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మె బుధవారానికి 22వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద వారు సమ్మెను కొనసాగించారు. మంగళవారం మృతి చెందిన వాసుదేవరావుకి సంతాపం తెలియజేస్తూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తట్టా కృష్ణ మాట్లాడుతూ సమ్మె ప్రారంభించి 22 రోజులు కావస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం నుంచి సానుకూలమైన స్పందన వచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై జనసేన అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు, జనసేన శ్రేణులు

సబ్బవరం, జనవరి 10 : మండలంలోని పలు గ్రామాల్లో ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహనకు జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల రమేష్‌బాబు బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఓటు వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందలి వెంకటరమణ, బలిరెడ్డి అప్పారావు, గండి దుర్గాప్రసాద్, ఉగ్గిన రాము, ఎస్.రవి, కర్రి కనకరాజు, బలిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విహారంలో విషాదం

- రోడ్డు రోలర్‌ను ఢీకొన్న బైక్
- ఇద్దరు డిగ్రీ విద్యార్థులు మృతి
- అరకులోయ నుంచి పాడేరు వెళుతుండగా ప్రమాదం
- మృతులిద్దరూ సాలూరు మండలం నడిమివలస వాసులు


పీదరపు రవితేజ, మెలిక వాసు (ఫైల్)

అరకులోయ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మన్యంలో పర్యాటక ప్రదేశాలను తిలకించేందుకు వచ్చిన ఇద్దరు డిగ్రీ విద్యార్థులు బుధవారం సాయంత్రం డుంబ్రిగుడ మండలం కురిడి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. మృతులు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం నడిమివలస గ్రామానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం...నడిమివలస గ్రామానికి చెందిన పీదరపు రవితేజ (20), మెలిక వాసు (20)లు విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతున్నారు. విహారయాత్రకని రవితేజ, వాసులు మరో నలుగురు తోటి విద్యార్థులతో కలిసి మూడు బైక్‌లపై బుధవారం అరకులోయ చేరుకున్నారు. ఇక్కడ సందర్శనీయ ప్రదేశాలను తిలకించి రాత్రికి పాడేరు చేరుకుని, అక్కడ బస చేసి గురువారు తెల్లవారుజామున వంజంగి హిల్స్‌కు వెళ్లాలని భావించారు. ఇందులో భాగంగా పగలంతా అరకులోయ చుట్టుపక్కల ప్రాంతాలను చూసి సాయంత్రం పాడేరు బయలుదేరారు. ఈ క్రమంలో డుంబ్రిగుడ మండలం కురిడి వద్ద నిలిచివున్న రోడ్డు రోలర్‌ను రవితేజ, వాసు ప్రయాణిస్తున్న బైక్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రవితేజ అక్కడికక్కడే మృతిచెందగా, వాసుకు తీవ్రగాయాలు కావడంతో అరకులోయ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు విహారయాత్రకు వచ్చి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో విషాదం చోటుచేసుకుంది. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు'

రావికమతం, జనవరి 10 : పశువులకు సోకే గాలికుంటి వ్యాధికి మందులు లేవని నివారణ ఒక్కటే మార్గమని పశు సంవర్థక శాఖ జేడీ డాక్టర్ బి.ప్రసాద్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం పశువులకు జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే నోటి నిండా, గిట్టలలో బొబ్బలు, మేత మేయలేని స్థితికి చేరుకుంటాయన్నారు. దీని నుంచి బయటపడేందుకు ప్రతి రైతు పెంపుడు పశువులకు ఏటా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సూచించారు

దేవరాపల్లిలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్.ఐ.నాగేంద్ర, ఇన్‌చార్జ్ సీఐ కుమారస్వామి, తహసీల్దార్ ఎం.లక్ష్మి, చోడవరం అగ్నిమాపక శాఖ అధికారులు ఇక్కడకు వచ్చారు. వాటర్ ట్యాంకు దిగి తమ సమస్యలు చెప్పుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులు వచ్చి సమాధానం చెప్పే వరకు కిందకు దిగేది లేదని రైతులు స్పష్టం చేశారు. దీంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పాడేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మ.. గురువారం రైతులతో చర్చలు జరుపుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.కార్యదర్శి ఉమాదేవి, విఆర్వో తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తున్న వారిలో 22 మందికి బుధవారం ఐసీడీఎస్ సీడీపీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీటిని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో గోడలకు అతికించారు. మిగిలిన వారికి గురు, శుక్రవారాల్లో షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్టు చెప్పారు. నోటీసులు జారీ చేసిన పది రోజుల్లో విధులకు హాజరు కావాలని, లేకపోతే విధుల నుంచి తొలగించాల్సి వుంటుందని నోటీసుల్లో హెచ్చరించారు. కాగా ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు మండిపడుతున్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం వైసీపీ ప్రభుత్వానికి తగదని అన్నారు. తమ డిమాండ్‌లను ఆమోదించే వరకు సమ్మె విరమించేది లేదని, అవసరమైతే విపక్షాల సాయంతో రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

మూడో జాబితాపై వైసీపీలో టెన్షన్

... 5వ పేజీ తరువాయి

బుధవారం ఉదయం నుంచి ప్రచారం జరిగింది. వైసీపీ అధిష్ఠానం జరిపించిన అనేక సర్వేల్లో ఎంపీ డాక్టర్ సత్యవతికి వ్యతిరేకంగా రిపోర్టులు అందాయని తెలిసింది. ఎంపీ అనకాపల్లి మినహా మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్దగా పర్యటించడం లేదని, సొంత పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలతో సఖ్యత లేదన్న అంశాలు పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. దీంతో వచ్చే ఎన్నికల్లో ఆమెకు టికెట్ కష్టమేనని కొద్దికాలంగా పార్టీ వర్గాలే పేర్కొంటూ వస్తున్నాయి. ఈ విషయం తెలుసుకున్న సత్యవతి రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి జగన్‌ను కలిసేందుకు తాడేపల్లి వెళ్లినట్టు సమాచారం. మరోసారి ఎంపీగా పోటీ చేయడానికి అవకాశం ఇవ్వాలని, ఒకవేళ వీలుకాకపోతే జిల్లాలో ఏదైనా ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరినట్టు సమాచారం. ఇదిలావుండగా విశాఖకు చెందిన కిలారి పద్మ అనే మహిళ పేరును కూడా వైసీపీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

వేతన జీవుల ఇక్కట్లు

... 5వ పేజీ తరువాయి

అందాయని, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేయడంతో పదో తేదీకి అటుఇటుగా అందుతున్నాయని చెప్పారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె

వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పని చేస్తున్న ఉద్యోగులకు కూడా సకాలంలో వేతనాలు చెల్లించడం లేదు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. అంగన్‌వాడీలు నెల రోజుల నుంచి రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వ పెద్దలు ప్రతిపక్షంలో వున్నప్పుడు ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్ల నుంచి అమలు చేయకపోగా, ఇప్పుడు సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తున్నది. పైగా తక్షణమే విధుల్లోకి చేరాలని, లేకుండా ఉద్యోగం నుంచి తొలగించాల్సి వస్తుందంటూ అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు.

హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు గత నెల 20వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారు. వీరి సమస్యలను సానుకూల దృక్పథంలో పరిష్కరించకపోగా, పుండు మీద కారం చల్లిన చందంగా కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచర్లను విధులను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్మాకు అదరం.. షోకాజ్‌కు బెదరం

- తేల్చి చెప్పిన అంగన్‌వాడీ కార్యకర్తలు
- డిమాండ్లు పరిష్కరించే వరకు పట్టు వీడేది లేదని స్పష్టీకరణ
- 30వ రోజు వివిధ రూపాల్లో ఆందోళనలు


గొలుగొండలో వినూత్న రీతిలో ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలు


నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో...


దేవరాపల్లి...

బుచ్చెయ్యపేట, జనవరి 10 : అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగించిన ప్రభుత్వం, తాజాగా వారు విధుల్లో చేరేందుకు డెడ్‌లైన్ విధించింది. గ్రాట్యుటీ అంశంపై పలు దఫాలుగా చర్చలు జరిపినా పెంచేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వేతనాలు పెంచే వరకు తాము ఆందోళనలు విరమించేది లేదని అంగన్‌వాడీలు తమ పోరాటాన్ని రోజు రోజుకు ఉధృతం చేస్తున్నారు. తాము కూడా పెంచేదే లేదని ఎస్మా ద్వారా వార్నింగ్ ఇస్తూ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని 22 అంగన్‌వాడీ కేంద్రాల్లోని గోడలకు అధికారులు నోటీసులు అంటిస్తున్నారు. పది రోజుల్లో విధుల్లో చేరకుంటే వేటు తప్పదని సదరు నోటీసులో పేర్కొనడంపై వారంతా మండిపడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో మొండిచేయి చూపడమే కాకుండా తమపై వేటు వేయడానికి జగన్ సర్కార్ సిద్ధపడిందని ఆరోపిస్తూ వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమపై ప్రయోగించిన ఎస్మాను ఉపసంహరించుకుని, డిమాండ్లను ఆమోదించే వరకు వెనక్కి లేదని అంగన్‌వాడీల సంఘం ప్రతినిధులు కోవెల వెంకటలక్ష్మి, ఆది వరలక్ష్మి, ఎలిశెట్టి అమ్మాజీ తదితరులు స్పష్టం చేశారు.

నర్సీపట్నం : అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారానికి 30వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ఆడిగర్ల రాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు పాల్పడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డి.మహాలక్ష్మి, సామ్రాజ్యం, వరలక్ష్మి, శోభా తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండల కేంద్రంలో నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్లపై పోరాటాన్ని సాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించే వరకు తాము వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం ప్రతినిధులు మంగతాయారు, భ్రమరాంబ, ఆర్.వెంకటలక్ష్మి, సత్య తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : అంగన్‌వాడీల సమ్మె రోజురోజు ఉధృతమవుతోంది. ఇందులో భాగంగా బుధవారం నాటికి ఆందోళన ముప్పైవ రోజుకు చేరుకోవడం 30 అంకె ఆకారంతో ఏర్పడి వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఎస్మాను ప్రయోగించినంత మాత్రన ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో జి.వరలక్ష్మి, పద్మ, సన్యాసమ్మ, గౌరి, అమ్మాజీ, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్నలతో పాటు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా మాడుగుల : బూడి


దేవరాపల్లిలో పర్యటిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి, జనవరి 10 : మోడల్ నియోజకవర్గంగా మాడుగులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగం గా బుధవారం దేవరాపల్లిలో పర్యటించి పలు చోట్ల సమస్యలు తెలుసుకున్నారు. అంతకుముందు కాశీపురంలో సచివాలయ భవనాన్ని, సమ్మెద రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గం అభివృద్ధి చెందుతున్నట్టు తెలిపారు. అనంతరం ఈనెల 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, బూరె బాబూరావు, మాజీ ఎంపీపీ భాస్కరరావు, కృష్ణమూర్తి, సర్పంచ్ పెంటమ్మ, నారాయణమ్మ, సిం హాచలంనాయుడు పాల్గొన్నారు.

వార్డుల్లో అభివృద్ధి పనులకు భూమిపూజలు


రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, జనవరి 10 : మునిసిపాలిటీలోని 15, 16, 21 వార్డులలో చేపట్టనున్న పద్దెనిమిది అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, మీసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం అందరి బాధ్యత : ఆర్డీవో జయరాం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

మాకవరపాలెం, జనవరి 10 : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ విధిగా వినియోగించుకోవాలని ఆర్డీవో జయరాం సూచించారు. ఇక్కడి అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండినవారంతా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఎక్కడైనా ఓటర్ల నమోదులో తప్పులు ఉంటే సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఆర్‌లు, వీఆర్‌వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరవై మద్యం బాటిళ్లు స్వాధీనం

దేవరాపల్లి, జనవరి 10 : నాగయ్యపేట శివారు సీతంపేటలో నిర్వహిస్తున్న బెల్టు షాపుపై ఎస్ఐ డి.నాగేంద్ర బుధవారం సిబ్బందితో కలిసి దాడిచేశారు. ఈ సందర్భంగా ఇరవై మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు బెల్టు షాపు నిర్వాహకుడు కొయినేన శ్రీరామమూర్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మూడు వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

నర్సీపట్నం అర్బన్, జనవరి 10 : చెట్టుపల్లి పంచాయతీ శివారు గదబపాలెం తోటల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచి మూడు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు నర్సీపట్నం రూరల్ ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడిచేసి, దాచిపెట్టిన బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు.

రైతులకు మోటారు కిట్లు పంపిణీ


రైతులకు మోటారు కిట్లు అందిస్తున్న ఎంపీపీ

రోలుగుంట, జనవరి 10 : జలకళ పథకంలో భాగంగా మంజూరైన మోటారు కిట్లను బుధవారం రోలుగుంటలో రైతులకు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో నూకరాజు, ఏపీవో సూర్యమణి తదితరులు పంపిణీ చేశారు. మండలంలోని కొమరవోలు, ఎస్.కొత్తూరు గ్రామాలకు చెందిన పలువురు రైతులకు ఈ విద్యుత్, మోటార్లు మంజూరయ్యాయని ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పాడి రైతులకు విశాఖ డెయిరీ బోనస్

బుచ్చెయ్యపేట, జనవరి 10 : పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా విశాఖ డెయిరీ పనిచేస్తున్నదని డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తెలిపారు. కోమళ్లపూడి మిల్క్ కూలర్ పరిధిలో గల 38 సంఘాల సభ్య రైతులకు మంజూరైన రూ.1.6 కోట్ల సంక్రాంతి బోనస్ చెక్కులను బుధవారం వేతన కార్యదర్శులకు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రావికమతం ఏరియా మేనేజర్ ఎస్.ప్రసాద్, ఎంపీటీసీ ఒడిగొండ అర్జున, కార్యదర్శి గొన్నా ఈశ్వరరావు, బుచ్చెయ్యపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్ సుంకర శ్రీను పాల్గొన్నారు.

ఇకపై ప్రయాణికులకు అనువుగా ఆర్టీసీ కాంప్లెక్స్

- నర్సీపట్నం డిపో అసిస్టెంట్ మేనేజర్ నాయుడు


షాపుల లీజుదారులను విచారిస్తున్న ఆర్టీసీ అధికారులు

రావికమతం, జనవరి 10 : మండల కేంద్రం రావికమతంలో గల ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఇకపై ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దుతామని నర్సీపట్నం ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎస్.ఎస్.నాయుడు తెలిపారు. బుధవారం ఇక్కడకు విచ్చేసిన ఆయన కాంప్లెక్స్‌ను, అద్దెకు ఇచ్చిన షాపులను, ఆవరణను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడి కాంప్లెక్స్‌లో ఉన్న నాలుగు షాపులలో కిరణా, పాన్‌షాపు, టీస్నాక్స్ దుకాణాలు, దీనికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని గోదాంగా ఉపయోగించుకునేందుకు రావికమతం గ్రామానికి చెందిన జెర్రిపోతుల బాబూరావుకు అద్దెకు ఇచ్చామన్నారు. అయితే ఈ షాపులో లీజ్‌లో పేర్కొన్నదానికి భిన్నంగా వ్యాపారం జరుగుతుండడంతో పాటు షాపుల ముందు ఆటోలు, బైక్‌లు, ఇతర వాహనాలు నిలుపుతుండడం వలన కాంప్లెక్స్ ఆవరణలో బస్సులు నిలిపేందుకు స్థలం లేదన్నారు. అగ్రిమెంట్ పత్రంలో ఉన్నమేరకు వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించామన్నారు. ఇకపై ఈ కాంప్లెక్స్ ఆవరణలో బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ ప్రయాణికులు కూర్చొనేందుకు వీలుగా ఫ్యాన్లు, కుర్చీలు అమర్చుతామన్నారు. అలాగే, త్వరలోనే ఇక్కడ తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కల్పించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం డీఈ నర్సింగరావు, విజిలెన్స్ విభాగం అధికారి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు వైసీపీ ప్రభుత్వం మొండిచేయి'


సమావేశంలో మాట్లాడుతున్న వీరసూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, జనవరి 10 : రాష్ట్రంలోని నిరుద్యోగులకు వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపిందని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీర సూర్యచంద్ర ఎద్దేవా చేశారు. ఇక్కడి ఎన్జీవో హోమ్‌లో బుధవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. జగన్ పాలనలో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఎన్నికల ముందుకు జగన్ ప్రకటించారని, ఇప్పుడు ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. త్వరలో నిరుద్యోగ గళం వినిపించేందుకు నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే గణేశ్ శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో రామశేఖర్, కిరణ్, నాయుడు పాల్గొన్నారు.

'గోవాడ'లో ఓచర్ పేమెంట్ కార్మికుల సమస్యలపై వినతి


షుగర్‌కేన్ కమిషనర్‌కు వినతిని అందిస్తున్న విప్ ధర్మశ్రీ, కార్మిక నాయకులు

చోడవరం, జనవరి 10 : గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఓచర్ పేమెంట్ కార్మికులను ఎన్నెమార్లుగా గుర్తించి, వారికి ఉద్యోగభద్రత కల్పించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకుడు కేవీవీఎస్ భాస్కరరావు కోరారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో షుగర్ కేన్ కమిషనర్ వి.వెంకటరావును కలిసి వినతి పత్రాన్ని అందేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీలో ఓచర్‌పేమెంట్ కార్మికులను ఎన్నెమార్లుగా గుర్తించకపోవడం వల్ల వారికి అన్యాయం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మూడెడ్ల శంకరరావుతో పాటు, కార్మిక సంఘం నాయకులు సత్య, వేపాడ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహభావం

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమా


కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో మనోరమా

మాకవరపాలెం,జనవరి 10 : క్రీడా పోటీలు విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని మరింత పెంపొందిస్తాయని మండల ప్రత్యేకాధికారిణి, ఎలమంచిలి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమా అన్నారు. మాకవరపాలెం హైస్కూల్‌లో బుధవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలన్నారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు బాలదొర, సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం అర్బన్ : మండల కేంద్రం నర్సీపట్నంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ఎంపీపీ సుర్ల రాజేశ్వరి ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో జయమాధవి, మునిసిపల్ కమిషనర్ రవిబాబు, పలుగ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : ఇక్కడి గురుకుల కళాశాలలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ గజ్జలపు మణికుమారి పోటీలను ప్రారంభించారు. ఎంపీడీవో డేవిడ్‌రాజ్, వైసీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యుడు బొందలరాజు, వైస్ ఎంపీపీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం: మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను బుధవారం ఇక్కడ నిర్వహించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎంపీడీవో ఎస్.హనుమంతరావు, ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడికాడ : ఇక్కడి హైస్కూల్ ఆవరణలో బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపీపీ కురచా జయమ్మ జడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మి ప్రారంభించారు. 13 గ్రామ సచివాలయాల నుంచి కబడ్డీ పోటీలకుగాను పురుషులు, బాలికల విభాగాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన ఈ పోటీలు హోరాహోరీగా సాగాయి. అయితే వీరంతా మంచినీటి ప్యాకెట్లతో సరిపెట్టుకున్నారే తప్ప, ఆయా సచివాలయాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎటువంటి భోజన సదుపాయం కల్పించలేదు. ఫలితంగా వారు ఆకలితో అలమటించాల్సి వచ్చింది. కాగా, పోటీల ప్రారంభోత్సవంలో వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, గొల్లవిల్లి స్వామినాయుడు, ఎంఈవో కె.బొంజుబాబు, పీఈటీలు పాల్గొన్నారు.

రావికమతం : నిర్దేశించిన సమయానికి క్రీడాకారులు హాజరు కాకపోవడంతో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు మండల కేంద్రంలో రావికమతంలో ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఇక్కడ బుధవారం మండల స్థాయిలో క్రికెట్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించారు. గ్రామ సచివాలయ స్థాయిలో 16జట్లను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. దీంతో పోటీలకు తరలి రావాలని ముందుగానే అధికారులు సమాచారం అందించారు. మొదటి పోటీ జడ్.బెన్నవరం, చినపాచిల జట్లు మధ్య జరగాల్సి ఉంది. మధ్యాహ్నం ఒంటి గంట అయినప్పటికీ చినపాచిల కీడాకారులు రాకపోవడంతో నిర్వాహకులు ఈ పోటీలను ఒంటి గంట తరువాత ఆలస్యంగా తు.తూ. మంత్రంగా ప్రారంభించి పూర్తిచేశారు.

మాడుగుల : యువత క్రీడలపట్ల శ్రద్ధ చూపాలని ఎంపీపీ వేమవరపు రామధర్మజ, మాడుగుల సర్పంచ్ యడ్ల కళావతి అన్నారు. బుధవారం ఇక్కడి జూనియర్ కళాశాలలో ఆడుదాం ఆంధ్రలో భాగంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. ఎంపీడీవో మీనాకుమారి, వైసీపీ నాయకులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి సింహాచలంనాయుడు, రమణి తదితరులు పాల్గొన్నారు.